సాక్షి అనంతపురం

సోమవారం । 10 । జూలై । 2023



మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ

బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఆంధ్రా వన్ సీఏటీసీ–2 క్యాడెట్లకు ఆది వారం మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. 8లో



ఖరీదైన జబ్బులు.. ఉచిత చికిత్సలు

ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్పొరేట్‌ను మించిన వైద్య సేవలు ఉచితం గా అందుతున్నాయి. ఏడు విభాగాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
37.8°/22.5°

జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడ క్కడా తేలికపాటి వర్షాలు పడ్డాయి.

న్యూస్‌రీల్

అనూష అరంగేట్రం అదుర్స్



భారత్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌తో అనూష

అనంతపురం/నార్పల: అనంతపురం జిల్లా ఆణి ముత్యం, భారత మహిళా క్రికెటర్ బి.అనూష అంతర్జాతీయ మ్యాచ్ అరంగేట్రం అదిరింది. ఆదివారం భారత్ – బంగ్లాదేశ్ మధ్య టి–20 మ్యాచ్ బంగ్లాదేశ్‌లోని మిర్పూర్‌లో జరిగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. భారత్ బౌలర్ అనూష నాలుగు ఓవర్లు వేసి 24 పరుగులు మాత్రమే ఇచ్చింది. వికెట్ తీయకున్నా ప్రత్యర్థులకు తన స్పిన్ బౌలింగ్‌తో చుక్కలు చూపించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 16.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లోనే భారత్ విజయం సాధించడం ఆనందంగా ఉందని అనూష 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపింది. భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నుంచి క్యాప్ అందుకున్నట్లు చెప్పింది. అనూష తొలి అంతర్జాతీయ మ్యాచ్‌ను పురస్కరించుకుని స్వగ్రామం నార్పల మండలం బండ్లపల్లిలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంబరాలు చేసుకు న్నారు.

నూతన మెనూ పక్కాగా అమలు కావాలి



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజ నాన్ని అందించాలని నిర్వాహకులను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు ఆదేశించారు. అనంతపురంలోని ఎస్సీ వసతి గృహం–2ను ఆదివారం ఆయన ఆక స్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలసి భో జనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతని స్తోందన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను సద్విని యోగం చేసుకుని ప్రతి ఒక్కరూ చక్కగా చదు వుకోవాలన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. అనంతరం జేడీని పూర్వ విద్యార్థి నులు సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి దామోదర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక శాసనాలు కాపాడండి

పెనుకొండ: విజయనగర సామ్రాజ్యంలో ముఖ్య భూమిక పోషించిన పెనుకొండ కోట నిర్మాణ శాసనాలను కాపాడాలని చరిత్రకా రుడు మైనాస్వామి కోరారు. పట్టణంలోని రాచ రికపు చరిత్రను చాటిచెప్పే శాసనాలు, కోట ఉత్తర ద్వార పరిసరాలను ఆదివారం ఆయన పరిశీలించారు. కోట ఉత్తర ద్వారం లోపలి గోడ దిమ్మెపై ఉన్న శాసనానికి, కోట భాగానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరారు.

అక్రమాలకు 'రిజిస్ట్రేషన్'

- బెళుగుప్ప మండలంలోని ఓ రైతు గత ఏడాది డిసెంబర్‌లో పొలం కొని రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నాడు. అయితే ఇటీవల ఆ పొలం పట్టాదారు పాసుపుస్తకం కోసం మ్యూటేషన్ చేసుకునేందుకు వెళితే.. తన రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు తేలింది. దీంతో వెంటనే కళ్యాణ దుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే.. కొనుగోలుదారు, అమ్మకందారు ప్రమేయం లేకుండానే ఆ రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్ రద్దు చేసినట్లు తెలిసింది. దీని వెనక పెద్ద మొత్తంలో డబ్బు దండుకున్నట్లు తేలడంతో బాధిత రైతు వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.

- అనంతపురం రామ్‌నగర్‌లోని అర్బన్, రుద్రంపేటలోని రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల సబ్ రిజిస్ట్రార్లు కొందరు డాక్యుమెంట్ రైటర్లను మధ్యవర్తులుగా పెట్టుకొని క్రయవిక్రయదారుల నుంచి రిజిస్ట్రేషన్ పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. డబ్బులివ్వక పోతే రిజిస్ట్రేషన్ చేయకుండా పెండింగ్‌లో పెట్టేస్తారు. కొనుగోలు దారులు నేరుగా వెళ్లి రిజిస్ట్రార్లను కలిస్తే మీ డాక్యుమెంట్ రైటర్లకు చెప్పాము... అక్కడికి వెళ్లి కలవాలంటూ సలహాలిస్తున్నారు.



ఇటీవల ఏసీబీకి చిక్కిన డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్

- అదనపు ఆదాయం కోసం అడ్డదారులు
- డాక్యుమెంట్ రైటర్లతో సబ్‌రిజిస్ట్రార్ల కుమ్మక్కు
- ప్రైవేట్ వ్యక్తుల ద్వారా డాక్యుమెంట్లకు వసూళ్లు



అనంతపురం అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కార్యాలయాలు అక్రమార్జనకు అడ్డాగా మారుతు న్నాయి. కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అదనపు సంపాదన కోసం అడ్డదారులను ఎంచుకుంటున్నారు. ఇందు కోసం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా దర్జాగా వ్యవహారం నడుపుతున్నారు. అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ సేవలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన రుసుము/చలానా కాకుండా అదనంగా ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేసుకుని.. అందుకు అనుగుణంగా వసూలు చేస్తున్నారు. వారు నిర్ణయించిన మేరకు డబ్బు అందకపోతే రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు వేస్తున్నారు. క్రయవిక్రయదారు లను రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పు కుంటున్నారు. ఆరు నెలల క్రితం అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడేరు మం డలం కమ్మూరుకు చెందిన 20 ఎకరాల అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్ చేశారు. భారీ మొత్తంలో డబ్బు దండుకుని కలెక్టర్ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగిం చినట్లు విచారణలో బయటపడింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో పాత్ర ఉన్న ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులతో పాటు అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులపై సైతం క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

అదనపు వసూళ్లలో మరికొన్ని ఇలా...

- స్థిరచరాస్తులకు సంబంధించి ఏవైనా వివాదాలు వంటివి ఉంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బం దికి పండుగే. అందినకాడికి డబ్బు లాగి.. రిజిస్ట్రే షన్ చేసిచ్చేస్తారు. అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్ మళ్లీ వేరుగా ఉంటుంది. భూమి విలువను బట్టి వసూలు చేస్తారు.
- ఈసీ కోసం రూ.550 దాకా చలానా కడితే మూడు వారాల్లోపు అందుతుంది. అత్యవసరం గా కావాలంటే రూ.3వేల దాకా కార్యాలయ సిబ్బందికి సమర్పిస్తే టక్కున ఈసీ ఇచ్చేస్తారు.
- ఇక మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం రూ.300లోపు చలానా కట్టి రోజుల తరబడి ఎదురుచూడకుం డా వెంటనే కావాలంటే రూ.2000 అదనంగా చెల్లిస్తే అలా ఇచ్చేస్తారు.

అధికారుల అవినీతిపై ఫిర్యాదుల వెల్లువ..

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిపోయాయి. ప్రతి డాక్యు మెంట్ రిజిస్ట్రేషన్‌కూ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల అవినీతి దందాపై అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్‌కు అధిక సంఖ్యలో ఫిర్యాదులు వెళ్తున్నాయి. గడిచిన రెండు నెలల వ్యవ ధిలో అనంతపురం అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రూరల్ సబ్ రిజిస్ట్రార్ మహబూబ్ అలీ డ్రైవర్ దగ్గర లభించిన రూ.2లక్షల నగదును సీజ్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌అలీని సస్పెండ్ చేశారు. ఇది మరవకముందే అనంతపురం అర్బన్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి, డాక్యుమెంట్ రైటర్ కరణం చంద్రశేఖర్, అతని అసి స్టెంట్ కృష్ణ మురళి నుంచి రూ.1.30లక్షల నగదును పట్టుకొని ముగ్గురిపై కేసులు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

ప్రైవేట్ వ్యక్తుల పెత్తనంపై ఆగ్రహం..

రామ్‌నగర్‌లోని అనంతపురం అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల పాత్రపై ఏసీబీ అధికారులు ఇటీవల కార్యాలయానికి వెళ్లి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నాలుగు గంటలకు పైగా విచారణ చేపట్టారు. 'రెగ్యులర్ ఉద్యోగుల స్థానాల్లో ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తారా? అక్ర మాలకు వీరే కేంద్ర బిందువులు. వారు కార్యా లయంలోని రికార్డులు తారుమారు చేస్తే ఎవరు బాధ్యులు?' అంటూ ఉద్యోగులపై ఏసీబీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సదరు ప్రైవేట్ వ్యక్తులకు గంట పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి కార్యాల యంలోకి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి పంపారు.

చర్యలు తప్పవు



రిజిస్ట్రేషన్ సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లిస్తే చాలు. అలా కాకుండా అధికారు లెవరైనా అదనంగా డబ్బు డిమాండ్ చేస్తే నేరుగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. కళ్యాణదుర్గంలో డాక్యు మెంట్ రద్దు చేసిన అంశానికి సంబంధించి విచారణ నివేదిక ఉన్నతాధికారులకు అందజే శాం. తదుపరి ఉత్తర్వులు రాగానే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్

కలెక్షన్ సెంటర్లకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్



పనసపండ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్

అనంతపురం అగ్రికల్చర్: పండ్లతోటల రైతులు పండించిన ఫలసాయానికి తగిన గిట్టుబాటు ధర లభించేలా కలెక్షన్ సెంటర్లను ప్రోత్సహి స్తున్నట్లు ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ తెలి పారు. కమిషనర్ ఆదివారం అనంతపురం రూరల్ మండలంలో పర్యటించారు. తొలుత కక్కలపల్లిలో మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్ మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) కింద రాయితీతో గతంలో ఇచ్చిన మినిమం ప్రాసె సింగ్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ దానిమ్మ విత్తనాలను వేరుచేసి ప్యాకింగ్ చేయ డం, పనస, చెరకు గడలు, పచ్చికొబ్బెరను వేరుచేసి చిన్నపాటి ప్యాకింగ్ చేసి మాల్స్, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్న విషయాన్ని నిర్వాహకుడు శ్రవణ్‌కుమార్ వివరించారు. అక్కడే రూ.12.50 లక్షల విలువ చేసే కోల్డ్‌రూం నిర్మాణాన్ని కమిషనర్ ప్రారంభిం చారు. ఇందుకు రూ.9 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం కాటిగానికా లువలో కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించి రైతు భాస్కర్‌తో వివరాలు ఆరా తీశారు. కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతు, మహిళా గ్రూపులకు రూ.15 లక్షల యూనిట్ విలువలో 75 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. వీటితో పాటు రైతులకు ఉపయోగ పడేలా ఉద్యాన పథకాల అమలుకు ప్రాధా న్యత ఇస్తున్నందున సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కమిషనర్ వెంట రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు బి.రఘునాథ రెడ్డి, జి.చంద్రశేఖర్, ఏపీఎంఐపీ అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో 'ఇంటర్'

- ప్రతి మండలంలోనూ జూనియర్ కళాశాల
- గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సీఎం నిర్ణయం
- పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలోని 15 మండలాల్లో అమలు
- ఆయా మండలాల్లో విద్యార్థులు, మౌలిక వసతులపై ఆరా

రాప్తాడురూరల్: పదో తరగతి పూర్తయిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పలువురు ఇంటర్ చదువులకు బయట ప్రాంతాలకు వెళ్లడం లేదు. ఆర్థికభారం, సొంత ఊరిలో ఇంటర్ చదువు అందు బాటులో లేకపోవడం ప్రధానకారణం. మరోవైపు భద్రత దృష్ట్యా కిలోమీటర్ల దూరంలో ఉన్న జూనియర్ కళాశాలలకు ఆడపిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా కూలీనాలి చేసుకునే కుటుంబాల్లో ఆడ పిల్లలను పదో తరగతికే చదువు చాలిస్తున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మండలంలోనూ ఉన్నత పాఠశాలల్లోనే ప్లస్ టూ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఒక బాలికల జూనియర్ కళాశాల, మరొకటి కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేలా నిర్ణయించారు.



కూడేరు జెడ్పీ హైస్కూల్

ఆయా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులోకి తేనున్నారు. తొలుత పైలట్ ప్రాజె క్టుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 మండలాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన స్కూళ్లలో ప్లస్ టూకు అవసరమైన మౌలిక వసతులపై ప్రభుత్వం ఆరా తీసింది. ఇందులో భాగంగా ఆయా స్కూళ్లలో 6–10 తరగతుల విద్యార్థుల సంఖ్య, విస్తీర్ణం, అందుబా టులో ఉన్న తరగతి గదులు, ల్యాబ్ సదుపాయం ఉం దా? లేదా? అని అడిగారు. ఈ వివరాలన్నీ రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు పంపారు.

కళాశాలల కోసం ఎంపిక చేసిన స్కూళ్లు..

అనంతపురం జిల్లా : జెడ్పీహెచ్‌ఎస్ బ్రహ్మసముద్రం, జెడ్పీహెచ్‌ఎస్ వేపులపర్తి, జెడ్పీహెచ్‌ఎస్ బుక్కరా యసముద్రం, జెడ్పీహెచ్‌ఎస్ రోటరీపురం, జెడ్పీహెచ్ ఎస్ గుమ్మఘట్ట, జెడ్పీహెచ్‌ఎస్ గొల్లపల్లి, జెడ్పీహెచ్ ఎస్ కూడేరు, జెడ్పీహెచ్‌ఎస్ జల్లిపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దవడుగూరు, జెడ్పీహెచ్‌ఎస్ క్రిష్టిపాడు.

శ్రీసత్యసాయి జిల్లా: ప్రభుత్వ స్కూల్ కదిరి, ఎంపీఎ ల్‌హెచ్‌ఎస్ కుటాగుళ్ల, జెడ్పీహెచ్‌ఎస్ బత్తలపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) బత్తలపల్లి, జెడ్పీహెచ్ ఎస్ బుక్కపట్నం, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) బుక్క పట్నం, జెడ్పీహెచ్‌ఎస్ గాండ్లపెంట, జెడ్పీహెచ్‌ఎస్ కటారుపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ గోరంట్ల, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) గోరంట్ల, జెడ్పీహెచ్‌ఎస్ ఎన్‌పీ కుంట, జెడ్పీహెచ్‌ఎస్ గూటిబైలు, జెడ్పీహెచ్‌ఎస్ ఓడీ చెరువు, జెడ్పీహెచ్‌ఎస్ కొండకమర్ల, జెడ్పీహెచ్‌ఎస్ పరిగి, జెడ్పీహెచ్‌ఎస్ సేవామందిర్, జెడ్పీహెచ్‌ఎస్ రొళ్ల, జెడ్పీహెచ్‌ఎస్ అలుపనపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ సోమందేపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ చాలకూరు.

పేద విద్యార్థులకు ప్రయోజనం

గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాల్లో ముఖ్యంగా ఆడపిల్లలను పదో తరగతి చదువులకే ఆపేస్తున్నారు. అందుబాటులో జూనియర్ కళాశాలలు లేకపోవడంతో దూర ప్రాంతాలకు పం పేదుకు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులకు ఇంటర్ విద్య అందుబాటులోకి వస్తోంది. ప్రతి మండలంలోనూ బాలికల జూనియర్ కళాశాల, కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించనున్నారు.

– ఎం.సాయిరామ్ డీఈఓ

టీడీపీ దోపిడీతోనే బీటీపీ ఆలస్యం

- ప్రభుత్వ విప్ కాపు ధ్వజం

రాయదుర్గం: చంద్రబాబు హయాంలో టీడీపీ నాయకులు జీడిపల్లి – బీటీపీ కాలువ తవ్వకంలో దోపిడీకి తెరతీయడం వల్లే పనులు ఆలస్యమ య్యాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. నాటి టీడీపీ నేతల అక్రమాల నేప థ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ నిర్వహించి అంచనాలకు మించి రూపొందించిన ప్రతిపాదనలను కుదించాల్సి వచ్చిందన్నారు. నాడు 1,407 ఎకరాల భూసేకరణకు గాను అరకొరగా పనులు చేపట్టి వదిలేశారని, నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేసింది మీరు కాదా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులును నిలదీశారు. మొదటి ప్యాకేజీ ద్వారా రూ.350 కోట్ల నిధులు మంజూరు చేయించానని చెప్పుకుంటున్న నీకు అందులో ఎంత ప్యాకేజీ వచ్చిందో ప్రజలకు తెలుసన్నారు. డీకేటీలో మినహా పట్టా భూముల్లో ఒక్క మీటరు కూడా తవ్వ కాలు చేపట్టని మీకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడటం తప్ప పనులు చేయించడంలో చిత్తశుద్ధి కనిపిం చలేదని విమర్శించారు. గత ఎన్నికలకు ఐదునెలల ముందు ఓట్ల కోసం హడావుడి చేసి దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారన్నారు. బీటీపీ పనుల కోసమంటూ చంద్రబాబు ఆనాడు రూ.950 కోట్లతో ఉత్తుత్తి జీఓ విడుదల చేశారని విమర్శించారు. ఉత్త ర్వులు తప్ప ఆచరణ ఎక్కడా లేదన్నారు. ఈమాత్రం దానికే జలదాతకు జేజేలు అంటు ఆనాడూ ఊరూవాడా ప్రచారం చేసుకుని ప్రజల్లో చులకన అయ్యారన్నారు. ఇప్పుడేదో రైతుల కోసం తాపత్రయపడుతున్నట్లు కాలవ శ్రీనివాసులు మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా ఉం దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతిగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. బీటీపీకి నిధులు ఇచ్చేది.. నీరు తెచ్చేది జగన్‌తోనే సాధ్యమనే నమ్మకం రైతుల్లో ఉందన్నారు. టీడీపీ వారిలా కాకుండా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చాకే బీటీపీ పనులు చేపట్టేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే నిర్వాసితులకు పరిహారం కింద రూ.208 కోట్లు కళ్యాణదుర్గం వేదికగా విడుదల చేశారన్నారు. రైతులంతా సంతోషంగా ఉంటే కాలవ మాత్రం కడుపుమంటతో రగిలిపోతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి కాలవకు లేదని గుర్తుచేశారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన సీఎంగా జగన్ పరిపాలన సాగిస్తున్నారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.



కాపు రామచంద్రారెడ్డి

సాఫ్ట్ స్కిల్స్‌లో మేటి

- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ శిక్షణ
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ముందుకొచ్చిన ఐటీ దిగ్గజ సంస్థ
- విద్యార్థులపై భారం లేకుండా ప్రభుత్వమే ఫీజులు భరించేలా ఏర్పాట్లు
- ఎస్కేయూ పరిధిలో 10వేల మంది, జేఎన్‌టీయూఏ పరిధిలో 15 వేల మందికి ఉచిత శిక్షణ



అనంతపురం: రాష్ట్రంలో ప్రతి విద్యార్థినీ అత్యున్నత నైపుణ్యాలతో ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చి దిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు మరో మైలురాయిని అధిగమించాయి. ఉద్యోగాన్వేష ణలో అత్యంత కీలకమైన సాఫ్ట్‌స్కిల్స్ పెంపొందించడం పై డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ అందిస్తోంది. విద్యార్థులపై ఆర్థిక భారం లేకుండా ఫీజు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోంది.

దేశంలోనే తొలి ప్రాజెక్ట్..

ప్రపంచంలో అగ్రగామి ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రభుత్వం శిక్షణ అం దజేస్తోంది. పరిమిత సంఖ్యలో కాకుండా అందరికీ శిక్షణ అందుబాటులో ఉండేలా మైక్రోసాఫ్ట్ ఆఫ్ స్కిల్లిం గ్ ప్రాజెక్ట్‌కు ఉన్నత విద్యామండలి, ఉన్నత విద్యాశాఖ శ్రీకారం చుట్టాయి. దేశంలోనే తొలి ప్రాజెక్ట్ కావడం గమనార్హం. ఇప్పటికే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యా లయం పరిధిలో 10 వేల మంది, జేఎన్‌టీయూ అనం తపురం పరిధిలో 15 వేల మంది విద్యార్థులు ఉచిత శిక్షణ పూర్తి చేశారు. ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు నాన్ ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ ప్రొఫెషనల్ (ఎంసీపీ), మైక్రోసాఫ్ట్ టెక్నికల్ అసోసియేట్ (ఎంటీఏ), మైక్రోసాఫ్ట్ ఫండమెంటల్ విభాగాల్లో 40 రకాల కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించారు.

లింక్డిన్‌తో 8 వేల కోర్సుల్లో ఉచిత శిక్షణ..

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కోర్సులే కాకుం డా 'లింక్డిన్' ప్లాట్‌ఫాంతో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా లింక్డిన్‌లోని టెక్నాలజీ, క్రియేటివిటీ, బిజినెస్ విభా గాల్లోని 8 వేలకు పైగా కోర్సులు విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. శిక్షణ పొందే విద్యార్థికి మైక్రోసాఫ్ట్ సంస్థ వంద డాలర్ల విలువైన గిఫ్ట్ ఓచర్లను కూడా అందిస్తోంది. మైక్రోసాఫ్ట్ అందించే కోర్సులతో పాటు ఇతర కోర్సుల కోసం, ల్యాబ్‌ల కోసం ఈ గిఫ్ట్ ఓచర్ క్రెడిట్‌ను విద్యార్థులు వినియోగించుకోవచ్చు. అజూర్ ఆరి ్ఫిషియల్ ఇంటెలిజెన్స్, అజూర్ వర్చువల్ మెషీన్స్, అజూర్ ఎస్‌క్యూల్ డేటాబేస్, యాప్స్ బిల్డింగ్ వంటి కోర్సులకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేకుండా విద్యా ర్థులకు అవకాశం కలుగుతుంది.

అక్టోబర్ నాటికి రెండో బ్యాచ్ శిక్షణ పూర్తి..

గతేడాది చేపట్టిన మైక్రోసాఫ్ట్ ఆఫ్ స్కిల్లింగ్ ప్రాజెక్ట్ ద్వారా రెండు యూనివర్సిటీల్లోనూ 25 వేల మంది శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికి రెండో బ్యాచ్ విద్యార్థుల శిక్షణ పూర్తికానుంది. మైక్రోసాఫ్ట్ అజూర్ కోర్సు శిక్షణ కోసం ఒక్కో విద్యార్థికి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి అద నంగా పరీక్ష ఫీజు రూ.3,750 విద్యార్థే చెల్లించాలి. కానీ ప్రభుత్వం ఫీజులన్నీ భరించి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది.

అత్యుత్తమ అవకాశాలు అందుకునేలా..

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్ లాంటి అధునాతన సాంకేతికత అందుబాటులోకి వస్తున్న తరుణంలో మన విద్యార్థులకు ఆ దిశగా అత్యుత్తమ నైపుణ్యాలు సమకూర్చేలా మైక్రోసాఫ్ట్ ఆఫ్ స్కిల్లింగ్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మైక్రోసాఫ్ట్ సంస్థ అందించే ఈ సర్టిఫికేషన్ కోర్సులకు అంతర్జా తీయంగా మంచి గుర్తింపు ఉండడంతో పాటు ఉపాధి త్వరగా లభిస్తుంది. మైక్రోసాఫ్ట్ ఆఫ్ స్కిల్లిం గ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది.

– జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

క్లుప్తంగా

వెల్డింగ్ షాపులో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దగ్ధమైన టిప్పర్



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిర: స్థానిక పావగడ రోడ్డులో ఉన్న ఓ వెల్డింగ్ షాపు వద్ద ఆదివారం సాయంకాలం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన ఓ టిప్పర్‌కు వెల్డింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి వాహనాన్ని చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేలోపు టిప్పర్ పాక్షికంగా దగ్ధమైంది. ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ విజయకుమార్ తెలిపారు.

'మ్యాప్ రీడింగ్'పై శిక్షణ

కూడేరు: దేశ సరిహద్దులో శత్రువుల కదలికలు గుర్తించాలన్నా, సైనికులు ఒక చోట నుంచి మరొక చోటికి సులువుగా వెళ్లాలన్నా మ్యాప్ రీడింగ్ కీలకమని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్లు కల్నల్ వైవీకే చైతన్య రెడ్డి, అక్షయ్ మాథూర్ సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఆంధ్రా వన్ సీఏటీసీ–2 క్యాడెట్ల శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణకు నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 508 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఆదివారం ఉదయం మ్యాప్ రీడింగ్, శత్రువులు ఎంత దూరంలో ఉన్నారో దిక్సూచి(కంపాస్) ద్వారా తెలుసుకోవడం, అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు వెళ్లడం (ఆప్టికల్)పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు రుద్ర తాపా, పవన్, దేవేంద్ర, ఎస్ఎస్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హాస్టళ్లకు సరుకుల సరఫరాకు టెండర్ల స్వీకరణ



ప్రశాంతినిలయం: జిల్లాలోని సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాలకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను నిత్యావసర సరుకులు, కోడి గుడ్లు, కోడి మాంసం సరఫరాకు టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచిన నిర్ణీత టెండర్ ఫారాలను అన్ని పనిదినాలలో పొందవచ్చు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు టెండర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఖరీదైన జబ్బులు.. ఉచిత చికిత్సలు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ ఐసీయూ

- పేదలకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ వైద్యం
- కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా ఏడు రకాల నాణ్యమైన చికిత్సలు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు ఇలా..	
మొత్తం వైద్య సేవలు	8
ప్రస్తుతం అందుబాటులో ఉన్న సేవలు	7
ఓపీ సేవల ప్రారంభం	2022, ఏప్రిల్ 18
సర్జరీలు ప్రారంభం	2022, మే 24
ఇప్పటి వరకూ ఓపీ సేవలు అందుకున్న వారి సంఖ్య	29,850 మంది

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసింది. దీని ఫలితంగా చిన్నపాటి సమస్యకు పక్క జిల్లా కర్నూలు లేకపోతే హైదరాబాద్, బెంగళూరుకు రోగులు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రిని బలోపేతం చేయడమే కాకుండా అత్యున్నత ప్రమాణాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫలితంగా పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు రూ.లక్షలతో కూడుకున్న సూపర్ స్పెషాలిటీ వైద్యం ఉచితంగా అందుతోంది. న్యూరో సర్జరీ, కార్డియాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీతో కలుపుకుని మొత్తం 7 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి సోమ, గురువారాల్లో న్యూరో, గ్యాస్ట్రో, మంగళ, శుక్రవారాల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, బుధ, శనివారాల్లో మెడికల్ గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ ఓపీ సేవలుంటాయి.

ఓపీ సేవల నుంచి ప్రధాన సర్జరీల వరకూ..

గతేడాది ఏప్రిల్ 18 నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఓపీ సేవలు మొదలయ్యాయి. ఇప్పటి వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు ఇతర ప్రాంతాల నుంచి 29,850 మంది రోగులు ఏడు రకాల అత్యున్నత వైద్య సేవలు పొందారు. 2022, మే 24 నుంచి సర్జరీలకు శ్రీకారం చుట్టగా, అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన అన్ని ఆపరేషన్లూ విజయవంతం కావడం గమనార్హం. ప్రధానంగా న్యూరో సర్జరీ, కార్డియాలజీ(గుండె) శస్త్ర చికిత్సలు వేగం పుంజుకున్నాయి. న్యూరో సర్జరీకి సంబంధించి ఇప్పటి వరకూ 11,854 మందికి ఓపీ, 447 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో ప్రధాన శస్త్రచికిత్సలు 221 కాగా, మరో 226 కేసులకు మైనర్ శస్త్రచికిత్స చేశారు. కార్డియాలజీకి సంబంధించి 3,433 మంది ఓపీ సేవలు అందుకోగా, 215 శస్త్రచికిత్సలు జరిగాయి.

కార్పొరేట్‌ను తలదన్నేలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అత్యున్నత ప్రమాణాలతో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తీర్చిదిద్దారు. అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, ఐసీసీయూలు, 200 పడకలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, న్యూరో, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీలకు మొత్తం 5 ఐసీయూలున్నాయి. న్యూరో, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీలకు ఆరు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ రకాల రక్త పరీక్షలు, ఫార్మసీ, అల్ట్రాసౌండ్, డాప్లర్, ఎక్స్‌రే, సిటీ స్కాన్ తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.



బెడ్‌పై ఉన్న ఈమె పేరు నాగమ్మ. ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామం. వెన్నుపూస అరిగి నరాలపై ఒత్తిడి నెలకొనడంతో నడవలేక ఇబ్బంది పడుతుండేది. పెద్ద పెద్ద నగరాల్లోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో ఈ నెల 3న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరడంతో 7వ తేదీ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందం ఆమెకు శస్త్రచికిత్స చేశారు. ఈ తరహా ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్ష వరకు తీసుకుంటారు. అయితే ఖరీదైన శస్త్రచికిత్సను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఉచితంగా చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. కూలినాలీ చేసుకుని బతుకీడుస్తున్న తమలాంటి వారి కోసం ఇంత పెద్ద ఆస్పత్రిని నిర్మించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఈ సందర్భంగా నాగమ్మ భర్త మీటేనాయక్ అన్నారు. పైసా ఖర్చు లేకుండా తన భార్యను మామూలు మనిషిగా మార్చిన వైద్యులకు, ఇందుకు దోహదపడిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో అతి తక్కువ కాలంలోనే మెరుగైన ఫలితాలు అందుకోగలిగాం. ముఖ్యంగా న్యూరో, కార్డియాక్ సేవలకు మంచి స్పందన ఉంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



డ్రైవింగ్ వృత్తితో జీవనం సాగిస్తున్న నాకు గత నెల 27న ఛాతి నొప్పి వచ్చింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స తర్వాత అదే రోజు ఉదయం 12 గంటలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం నాకు ఆపరేషన్ చేసి, ప్రాణాలు కాపాడారు. ఈ ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిసింది. నాలాంటి సామాన్యుడికి అంత డబ్బు పెట్టి ఆపరేషన్ చేయించుకునే పరిస్థితి ఎక్కడుంటుంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేకుంటే నా పెళ్లాం, బిడ్డల పరిస్థితి ఏమిటో తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తోంది. ఇంత పెద్ద ఆస్పత్రిని మా బోటి వారి కోసం ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఉమర్ షరీఫ్, లక్ష్మీనగర్, అనంతపురం

బొగ్గు లారీ బోల్తా- డ్రైవర్ మృతి



పత్తి చేనులో బోల్తాపడిన లారీ

ఉరవకొండ: సుదూర ప్రాంతం నుంచి వస్తున్న లారీ విడపనకల్లు మండలంలో బోల్తాపడింది. ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని గదక్‌కు చెందిన పరుశురాం (49) లారీ డ్రైవర్‌గా జీనవం సాగిస్తున్నాడు. క్లీనర్ గోపితో కలసి శనివారం రాత్రి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం నుంచి బొగ్గు లోడుతో కర్ణాటకలోని హోస్పేటకు బయలుదేరాడు. ఆదివారం ఉదయం విడపనకల్లు మండలం గడేకల్లు వద్ద జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో నియంత్రణ కోల్పోయి లారీ పక్కనే ఉన్న పత్తి చేనులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో క్లీనర్ గోపి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్లీనర్ గోపిని ఆస్పత్రికి తరలించారు. జేసీబీల సాయంతో లారీని పైకి లేపి డ్రైవర్ మృతదేహాన్ని వెలికి తీసి, గుంతకల్లులోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీసీఎస్ ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వెల్లడించారు. అనంతపురంలోని చంద్రా హాస్పిటల్ సమీపంలో శనివారం ఉదయం 6 గంటలకు వాకింగ్ చేస్తున్న వృద్ధురాలు సుగణమ్మ మెడలోని బంగారు గొలుసును యువకుడు మాటల్లో పెట్టి అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల్లో కనిపించిన దృశ్యాల ఆధారంగా నిందితుడిని అనంతపురంలోని ఐదో రోడ్డుకు చెందిన వడ్డే మంజుల రామకృష్ణగా గుర్తించి, ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం అంగీకరించాడు. గుత్తిరోడ్డులోని ఓ షెడ్డులో డీజిల్ మెకానిక్‌గా పనిచేస్తున్న రామకృష్ణ... అక్కడి ఆదాయం సరిపోక ఇబ్బందులు పడేవాడు. ఈ క్రమంలోనే కిడ్నీలు పాడైనట్లు వైద్యులు తెలపడంతో చికిత్సకు రూ.2 లక్షల వరకూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. చివరకు వడ్డీలు సైతం చెల్లించలేక సతమవుతూ చైన్ స్నాచింగ్ చేయాలని భావించాడు. ఇందులో భాగంగానే సుగుణమ్మను మాటల్లో పెట్టి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించుకెళ్లినట్లు వివరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

రాప్తాడు: రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం యరడికెర గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (23) అనంతపురానికి వలస వచ్చి ఓ క్యాటరింగ్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు వస్తున్న విషయం గమనించకుండా పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచార అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లికి చెందిన హనుమంతు(40) డిష్ కేబుల్ కనెక్షన్ల మరమ్మతు పనులతో జీవనం సాగిస్తున్నాడు. డిష్ కేబుల్ మరమ్మతు కోసం ఆదివారం బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి వచ్చాడు. గొల్లలదొడ్డిలో కరెంటు స్తంభానికి నిచ్చెన వేసుకుని పైకెక్కి మరమ్మతు చేస్తుండగా గాలికి విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కింద పడ్డాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బ్రహ్మసముద్రం ఎస్ఐ పరుశురాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జగన్ సునామీలో విపక్షాల గల్లంతు ఖాయం

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్



మాట్లాడుతున్న ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హవా ముందు టీడీపీ, జనసేన పార్టీ గల్లంతు కావడం ఖాయమని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయి అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్‌తో పోటీ పడాలంటే స్వచ్ఛమైన నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు. అలాంటి లక్షణాలు పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, నారా లోకేష్‌లో లేవన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఏ రోజు ఒక మాట మీద స్థిరంగా లేని పవన్ కళ్యాణ్ ఏనాటికీ రాజకీయ నాయకుడు కాలేడన్నారు. రాజకీయ వృద్ధాప్యంలో ఉన్న చంద్రబాబు అమలుకు సాధ్యం కాని వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చలేక చేతులు కాల్చుకున్నారన్నారు. వంచనకు, వెన్నుపోట్లకు చిరునామాగా మారిన చంద్రబాబును రాష్ట్రంలో ప్రజలు ఎవరూ విశ్వసించడం లేదన్నారు. పవన్ వారాహి, చంద్రబాబు బస్సు, నారా లోకేష్ పాదయాత్రలు ఎన్ని చేసిన సీఎం వైఎస్ జగన్‌కున్న ప్రజాదరణ ముందు గల్లంతవ్వడం ఖాయమన్నారు.

అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

యాడికి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 39 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఇందుకు యాడికిలోని చౌడేశ్వరి కల్యాణమంటపం వేదికై ంది. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను నారాయణస్వామి, సంపత్‌కుమార్, సుబ్బారెడ్డి, అశ్వత్థరెడ్డి, విజయభాస్కరరెడ్డి, లక్ష్మీనారాయణ, శేషప్పను పూర్వ విద్యార్థులు శాలువాలతో ప్రత్యేకంగా ఘనంగా సన్మానించారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ, సెల్ఫీలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు బాలా రమేష్‌బాబు, జానపాటి ప్రసాద్, సతీష్ కుమార్‌రెడ్డి, పొగాకుల రాజు, బలరామిరెడ్డి, మల్లి, పుల్లారెడ్డి, ధనపతి, నాగరంగయ్య, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చింతా మల్లేష్ తదితరులు నేతృత్వం వహించారు.

సంతృప్తికరంగానే భూగర్భ జలాలు

- భూగర్భజలశాఖ డీడీ తిప్పేస్వామి వెల్లడి



కె.తిప్పేస్వామి

అనంతపురం అగ్రికల్చర్: వేసవి అనంతరం వర్షాభావం నెలకొన్నా.. జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. గత ఏడాది ఇదే సమయంలో 8.22 మీటర్ల నీటి మట్టం ఉండగా.. తాజాగా జిల్లాలోని 97 ఫిజోమీటర్ల నుంచి సేకరించిన గణాంకాల మేరకు సగటున 8.80 మీటర్లుగా నమోదైనట్లు వివరించారు. జూన్ నుంచి ఇప్పటి వరకూ 61 మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 25 శాతం తక్కువగా 45 మీటర్లు వర్షం కురిసిందన్నారు. దీంతో గత నెల కంటే భూగర్భజలాలు స్వల్పంగా తగ్గాయన్నారు. వర్షం రూపంలో 16.36 టీఎంసీలు ప్రవహించగా అందులో 1.96 టీఎంసీలు భూమిలో ఇంకినట్లు తెలిపారు. యల్లనూరు మండలంలో భూగర్భజలాల వినియోగం అధికంగా ఉందన్నారు. మిగిలిన 30 మండలాల పరిస్థితి ఆశాజనకంగా ఉందన్నారు. నీరు, భూమి, చెట్లు చట్టం (వాల్టా) ప్రకారం జిల్లా వ్యాప్తంగా కేవలం 12 గ్రామాల్లో కొత్తగా బోరుబావుల తవ్వకం నిషేధం ఉందని తెలిపారు. వర్షాకాలం కావడంతో మున్ముందు నీటిమట్టం మరింత పెరిగే పరిస్థితి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చెలరేగిన బ్యాటర్లు



సంజయ్‌నాయుడు



గిరినాథ్

అనంతపురం: సౌత్ జోన్ అంతర జిల్లాల సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ మూడో రౌండ్ పోటీల్లో బ్యాటర్లు చెలరేగారు. అనంత క్రీడా గ్రామం వేదికగా అనంతపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు అనంతపురం – నెల్లూరు, వైఎస్సార్ – కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో జరిగాయి. అనంతపురం –నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 90 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఎస్.రేవంత్ రెడ్డి 97 పరుగులు, పి. సుబ్రహ్మణ్యం (70 బంతుల్లో 135 పరుగులు) సాధించారు. అలాగే కర్నూలు–వైఎస్సార్ జిల్లా మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత కర్నూలు జట్టు బ్యాటింగ్ చేసింది. 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 371 పరుగులు భారీ స్కోరు చేసింది. వి.సంజయ్‌నాయుడు 193 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 119 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ యుఎంఎస్ గిరినాథ్ 12 ఫోర్లతో 101 పరుగులతో అద్భుతమైన భాగస్వామ్యాన్ని అందించాడు.

టీడీపీ నేత ఆత్మహత్య



అనిల్‌కుమార్ నాయుడు (ఫైల్)

పెద్దపప్పూరు: పార్టీ పటిష్టత కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక టీడీపీ నేత ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన అనిల్‌కుమార్ నాయుడు (42) తెలుగు యువత మండల అధ్యక్షుడిగా పనిచేశాడు. భార్య శ్రీదేవి, కుమారుడు అభ్యుదయకుమార్‌తో కలసి తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసేవాడు. తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేస్తున్న సమయంలో పార్టీ కార్యక్రమాల కోసం అప్పులు చేశాడు. అప్పులు తీర్చే అంశంలో పార్టీ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరించడంతో మనస్తాపం చెంది తెలుగు యువత అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. ఈ క్రమంలోనే ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తనకున్న భూమిని అమ్మి అప్పులు చెల్లించాడు. అయినా అప్పులు తీరలేదు. భూమి లేకపోవడంతో జీవనం మరింత భారమైంది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువతి బలవన్మరణం



శివలక్ష్మి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లికి చెందిన దేవనబండ శివలక్ష్మి(21) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... దేవనబండ రాముడు కుమార్తె శివలక్ష్మి కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఏడాది లోపు శివలక్ష్మి తల్లి, అక్క అనారోగ్యంతో మృతిచెందడం ఆమెను మరింత కుంగదీసింది. అప్పటి నుంచి తీవ్ర మానసిక ఒత్తిడితో ముభావంగా ఉన్న శివలక్ష్మికి పెళ్లి చేస్తే మార్పు వస్తుందని తండ్రి రాముడు భావించాడు. ఇదే విషయాన్ని ఆమెతో తెలిపాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తండ్రి, సోదరుడు గమనించి ఉరికి వేలాడుతున్న శివలక్ష్మిని కిందకు దింపి గుత్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన కమిషనర్ భాగ్యలక్ష్మి



కమిషనర్ భాగ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదివారం విధుల్లో చేరారు. ఈ ఏడాది మార్చి 16న ఆమె నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి కిందపడి గాయపడిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ భాగ్యలక్ష్మికి అదనపు కమిషనర్ రమణారెడ్డి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంతల ద్వారా రూ.3.56 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3.56 లక్షలకుపైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,11,130 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,45,620 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

అనంతేశ్వరికి ఆషాఢం సారె



అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించడానికి తరలివచ్చిన మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలోని అనంతేశ్వరికి భక్తులు ఆషాఢం సారెను సమర్పించారు. ఆదివారం సాయంత్రం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



ఏబీవీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జాతీయ కార్యవర్గ సభ్యురాలు కవిత

అనంతపురం: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతర పోరాటాలు చేసిన చరిత్ర ఉందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కవిత అన్నారు. ఆదివారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏబీవీపీ 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు వాల్మీకి చెన్నయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నయ్య, యూనివర్సిటీ కమిటీ అధ్యక్షుడు దివాకర్ నాయక్ , ఏబీవీపీ నాయకులు ఇంద్ర, సుధీర్, బద్రి, వికాస్, హరి, కుల్లాయప్ప, రవితేజ, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: స్థానిక ఆజాద్‌నగర్‌లో నివాసముంటున్న హరికృష్ణ అనే వ్యక్తి కనిపించలేదని అతని భార్య శ్వేత నాల్గో పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈనెల 2న తన మిత్రులు రమేష్ షఫీ, ఓంకార్‌తో కలిసి హరికృష్ణ గోవాకు వెళ్లాడు. బెంగళూరు నుంచి విమానంలో గోవాకు వెళ్లారు. 4వతేదీ నుంచి ఫోన్ కలవలేదని బాధితురాలు వాపోయింది. నా భర్త మిత్రులు ఓంకార్, రమేష్, షఫీ అనంతపురం వచ్చారని, నా భర్త ఆచూకీ తెలియ రాలేదని తెలిపింది. ఇదిలా ఉండగా హరికృష్ణతో కలిసి వెళ్లిన మిత్రులు ఓంకార్, రమేష్, షఫీ మాత్రం అతన్ని ఇంటి వద్ద వదిలిపెట్టామని చెప్తున్నారు. పోలీసులు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రీటౌన్ సీఐగా ధరణీకిశోర్




బాధ్యతలు స్వీకరించిన ధరణీకిశోర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ధరణీ కిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్టేషన్‌కు వచ్చిన ఆయన.. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. పీటీసీలో విధులు నిర్వహిస్తున్న ధరణీ కిశోర్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో పని చేసిన కత్తి శ్రీనివాసులు పీలేరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని కల్లూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

టమాట.. కాసుల పంట

- కిలో టమాట ధర రూ.100కు పైమాటే
- టమాట పంట సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- టమాట నారుకు పెరిగిన డిమాండ్



ఆత్మకూరు: రైతన్న ఆరుగాలం కష్టించి టమాట పండిస్తే.. ధర లేక, అతికష్టమ్మీద మార్కెట్‌కు తరలించినా రవాణా ఖర్చులు కూడా చేతికందక రోడ్లపైనే పారబోసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం టమాట ధరలు చుక్కలనంటుతున్నాయి. కిలో రూ.100కు పైమాటే. రైతన్నకు, వ్యాపారులకు కాసుల పంటే అన్నట్లుంది ధర. ప్రస్తుతం మార్కెట్‌లో 15 కిలోల టమాటా బాక్సు ధర రూ.1300 పైగానే పలుకుతోంది. ఇక 30 కిలోల బాక్సు ధర రూ.3 వేలకు పై మాటే పలుకుతోంది. ధర చూసి రైతన్నలు టమాట పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో టమాట మొక్కలు (నారు)కు డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా ఇప్పటికే 3 వేల ఎకరాల వరకు టమాట పంట సాగు చేశారని ఉద్యాన అధికారుల లెక్కలు చెప్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న టమాట ధరలను చూసి ఎక్కడ చూసినా టమాట పంట సాగు చేస్తున్నారు. ఒక ఎకరం పొలంలో టమాట సాగు చేయడానికి రూ.20 వేల వరకు ఖర్చవుతోందని రైతులు చెప్తున్నారు.

టమాట మొక్కలకు పెరిగిన డిమాండ్..

ప్రస్తుతం మార్కెట్‌లో టమాట మొక్కలు (నారు)కు మంచి డిమాండ్ పెరిగిందని రైతులు చెప్తున్నారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా దాదాపు 40 నర్సరీలకు పైగా ఉన్నాయి. ఒక్కో నర్సరీలో దాదాపు రెండు లక్షల వరకు టమాట మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం టమాట మొక్కలు రకాన్ని బట్టి 30 పైసలు నుంచి 50 పైసల వరకు నర్సరీల్లో ధర ఉంది. టమాట ధరలు పెరగడంతో మొక్కలకు కూడా డిమాండ్ ఉంది.



ఆత్మకూరు వద్ద సాగు చేసిన టమాట పంట



నర్సరీల్లో అమ్మకానికి ఉంచిన టమాట మొక్కలు

బ్రాహ్మణ కుటుంబ వ్యవస్థకు అద్దం పట్టేదే 'తరం'



ఆలయంలో పూజలు జరిపిస్తున్న లఘుచిత్ర నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: సనాతన బ్రాహ్మణుల కుటుంబ వ్యవస్థకు 'తరం' లఘుచిత్రం దర్పణం పట్టేలా ఉంటుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. నగరంలో చిత్రీకరిస్తున్న లఘు చిత్ర విశేషాలను నిర్వాహకులు శ్రీనిధి రఘు, దర్శకుడు ఆదిత్య ఆదివారం తెలియజేశారు. అంతకుముందు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో స్క్రిప్ట్‌కు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సంయుక్తంగా ప్రయోజనాత్మక చిత్రాన్ని నిర్మిస్తోందన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అర్చక పురోహిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కలసపాటి లక్ష్మీనారాయణ ఆత్మీయ అతిథిగా మాట్లాడుతూ సమాజానికి ఎనలేని సేవలందించిన పురోహిత వర్గం ప్రాధాన్యతను మరోసారి ఈ లఘు చిత్రం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో పురోహిత విభాగం ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప, తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షులు రమణారావు , రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో 'అనంత'కు మొదటి స్థానం



మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం బాల్‌బ్యాడ్మింటన్ జట్టు

అనంతపురం: అనంతపురంలో ఈనెల 8,9వతేదీల్లో జరిగిన గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు తొలిస్థానంలో నిలిచింది. బనగానపల్లి జట్టు రెండో స్థానం, నెల్లూరు నగరం జట్టు మూడో స్థానం, ధర్మవరం జట్టు నాలుగో స్థానం, ఐదో స్థానంలో చిత్తూరు జట్టు నిలిచాయి. మొదటి బహుమతి రూ.15 వేలు కృష్ణకాంత రెడ్డి, రెండో బహుమతి రూ.12 వేలు దాసరి విజయ్‌కుమార్, మూడో బహుమతి రూ.8 వేలు బండిమీదపల్లి వెంకటరాముడు, నాలుగో బహుమతి రూ. 6 వేలు డీఎంహెచ్‌ఓ సూపరింటెండెంట్ సి. ఉదయ్‌కుమార్ , ఐదో బహుమతికి రూ.5 వేలు శ్రీరామ్ వితరణ చేశారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ ఈశ్వరయ్య, టోర్నమెంట్ ఆర్గనైజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభాగ్యుడికి కృత్రిమ కాలు వితరణ



నరసింహామూర్తికి కృత్రిమకాలు అందిస్తున్న 'అమ్మ' రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ఓ అభాగ్యుడికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి కృత్రిమ కాలు ఆదివారం అందించారు. నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన నరసింహామూర్తి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ప్రమాదవశాత్తూ రెండేళ్ల కిందట ఓ ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకున్నాడు. వైద్యం ఖర్చులు భారంగా మారి, మంచానికి పరిమితమయ్యాడు. పరిస్థితి తెలుసుకున్న అమ్మ సంస్థ రమణారెడ్డి మిత్రులతో కలిసి నరసింహామూర్తికి రూ.45 వేలు విలువ చేసే కృత్రిమ కాలు అందించాడు.

రేపు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం: నగరంలో ఈనెల 11న నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ ఎస్‌ఈ సతీష్ చంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాగునీటి మెయిన్ పైపు లైన్ జల్లిపల్లి టోల్‌గేట్ వద్ద లీకేజీతో మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. నగర ప్రజలు సహకరించాలని ఎస్‌ఈ తెలిపారు.

పోటాపోటీగా కబడ్డీ పోటీలు



ఎగువపల్లిలో కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో గాలెమ్మ జాతర సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో 24 టీములు పాల్గొనగా, శనివారం అర్ధరాత్రి వరకు పోటీలు పోటాపోటీగా జరిగాయి. కర్నూలు జిల్లా ప్యాపిలి జట్టు మొదటి స్థానంలో, అనంతపురానికి చెందిన వివేకానంద జట్టు రెండో స్థానం , తాడిపత్రి జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతిగా రూ.7016, మూడో బహుమతిగా రూ.4016 నగదు అందజేశారు.

ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. తిమ్మంపేటకు చెందిన కృష్ణారెడ్డి, నారపరెడ్డి ద్విచక్రవాహనంపై గార్లదిన్నెకు వెళ్తుండగా, తీరా తలగాచిపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి ఐచర్ వాహనం ద్విచక్ర వాహన్ని ఢీకొనింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్ పరీక్షలు



బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 75 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు ఆదివారం చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రక్త దానం చేయడమంటే నిండు ప్రాణాన్ని కాపాడినట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో రక్తం ఎవరికైనా అవసరమై ఇవ్వడానికి వీలుగా రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి తేజ, ఉపాధ్యక్షులు కమలాకర్, భరత్, సుధీర్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు

రాప్తాడురూరల్: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఏలూరులో జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏజీ నాగభూషణం, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓ బలరాముడు హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అప్పయ్యచౌదరి, మాజీ మంత్రి రంగారావు హాజరయ్యారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్స్‌లో రిజర్వేషన్స్, క్రీమీలేయర్, బీసీ భవన నిర్మాణం తదితక సమస్యలపై చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈజీ నాగభూషణం తెలిపారు.

దైవచింతనే మోక్ష మార్గం



నార్పలలో కలసిన ముస్లింలు

నార్పల: ప్రతి ఒక్కరికీ దైవచింతనే మోక్ష మార్గమని అనంతపురం మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌బాషా, మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లింల సమావేశం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి ముస్లింలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ బాషా, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి నూతనంగా నిర్మించిన మదరసాను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లింలు మదరసాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మౌలానా షామీర్, జిల్లా బాధ్యులు అమీర్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న 'ఆదరణ' బాధితులు

మా డబ్బు మాకివ్వండి

ఆదరణ సంస్థలో చిట్స్ రూపంలో తాము చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు. నగరంలోని బాలాజీ కల్యాణమంటపంలో ఆదివారం 'ఆదరణ' ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు తమ డబ్బు విషయమై సంస్థ నిర్వాహకులను ప్రశ్నించారు. చిట్స్ డబ్బు ఇవ్వమంటే స్థలాలు తీసుకోవాలని చెప్పడం తగదన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా అఖిల్



గుత్తి: పట్టణంలోని కురుబ వీధికి చెందిన ఆకుతోట రంగనాయకులు, రేఖ కుమారుడు అఖిల్ సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 24న ఘజియా బాద్‌లో అఖిల్ సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అఖిల్‌కు పట్టణవాసులు, బంధువులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

మాతాశిశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: మాతా,శిశువులకు అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మాతాశిశు ఆరోగ్య సేవలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎంహెచ్‌ఓ తెలియజేశారు. గర్భస్థ ఆరోగ్య సేవలు, గర్భిణుల రిజిస్ట్రేషన్, ఎంసీపీ కార్డుల అందజేత, హిమోగ్లోబిన్, హెపటైటీస్ బీ పరీక్ష, టీటీ ఇంజెక్షన్, బర్త్ ప్లానింగ్, రవాణా సౌలభ్యం, తదితర సేవలపై ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. హైరిస్క్ సేవలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ సహీబా, సిబ్బంది మారుతీ ప్రసాద్, డెమో ఉమాపతి, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రధాన నగరాలు తలపించేలా అభివృద్ధి



కోవూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వీధి సూచిక బోర్డును పరిశీలించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: ప్రధాన నగరాలను తలపించేలా అనంత నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం కోవూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వీధి సూచికలను (బోర్డులు)ఆయన పరిశీలించారు. ప్రాంతంలోని నాగుల కట్ట నుంచి నేషనల్ హైవే పెట్రోల్ బంకు వరకు సూచికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలోని ప్రతి వీధిలో సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇలాంటి సూచికల ఏర్పాటుతో మరింత సులువుగా చిరునామా తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికే నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నట్లు తెలిపారు. సాధారణ నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం , సీఎం ప్రత్యేక నిధుల పనులు మరో ఐదారు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

డ్యాన్సర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కత్తి విజయ్‌కుమార్



నూతనంగా ఎంపికైన కార్యవర్గం, విజయ్‌కుమార్‌కు అభినందన

అనంతపురం కల్చరల్: బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి విజయ్‌కుమార్ డ్యాన్సర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా రమేష్‌కుమార్, చందు, కార్యదర్శిగా విష్ణు మాస్టర్, జాయింట్ సెక్రటరీగా గుత్తి గోరా, సురేంద్ర, ట్రెజరర్‌గా ధర్మవరం వినోద్, ఈసీ మెంబర్స్‌గా కుళ్లాయి, విజయ్, వంశీ, శ్రీకాంత్ నాయక్, మురళీ, దుర్గ తదితరులను ఎంపిక చేశారు. మరో 20 మంది డ్యాన్స్ మాస్టర్లను సాధారణ సభ్యులుగా ఎంపిక చేశారు. డ్యాన్స్ అసోసియేషన్‌కు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికై న కత్తి విజయ్‌కుమార్‌ను నాట్యాచార్యులు సంధ్యామూర్తి, లలితకళా పరిషత్తు కార్యదర్శి పద్మజ అభినందించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి పెద్దమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామంలోని అనంతపురం – తాడిపత్రి రహదారి పక్కన ఉన్న పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి వెండి ముఖ కవచం, గొడుగులు 70 తులాల వరకు ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

సర్పరూపుడికి విశేష పూజలు



అలంకరణలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, బంగారు కవచం ధరింపజేసి పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. కాలసర్పదోష పూజలు, ఆకు పూజలు, ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామికి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని,108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా గాలెమ్మ జాతర



ఎగువపల్లిలో అలంకరణలో గాలెమ్మ

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఆదివారం గ్రామస్తులు గాలెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పంటలు పండి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఏటా ఆషాఢ మాసంలో గాలెమ్మ జాతర నిర్వహించడం అనవాయితీ. గాలెమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు,అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.